జానపద కథలు

1

# ఎవరు పండితుడు?

అనగనగా ఒక గ్రామంలో ఒక గొప్ప పండితుడు ఉండేవాడు.

అయన ఎన్నో వేద శాస్త్రాలు, పురాణాలు చదువుకున్నాడు. ఎంత చదువుకున్నా మూఢాచారాలు మాత్రం ఆయనని వదలలేదు. మడీ, ఆచారం – ఇవన్నీ చాలా ఎక్కువగా ఉండేవి. అయినా అవి ఆయన స్వంత విషయాలు కనుక, బయటివారికి అంత బాధగా ఉండేవి కావు. కాని, ఆయనకి అంటరానితనం పట్టింపు చాలా ఎక్కువగా ఉండేది. ఆయన పోయి వాళ్ళనేమీ ముట్టుకోనక్కరలేదు. కాని, వాళ్ళు ఇంటి ముందు నుంచి నడచి వెళ్లినా, ఎక్కడైనా కనిపించినా.. కస్సుబుస్సుమంటూ నోటికొచ్చినట్లు తిట్టేవాడు. కొట్టేంతపని చేసేవాడు. వాళ్ళు నడిచినచోట అవుపేడనీళ్లు చల్లి శుద్ధి చేసేవాడు. అంతటి చాదస్తం ఆయనకి.

అదే ఊళ్లో 'రామదాసు' అనే మాలదాసరి ఉండేవాడు. అతను ఎంతో మంచివాడు. ఒళ్ళువంచి పనిచేస్తూ ఖాళీ సమయంలో దైవ ధ్యానం చేసుకుంటూ ఉండేవాడు. గంగిగోవు వంటి ఈ రామదాసు కనిపించినా కూడా కస్సుబుస్సుమని కసురుకునేవాడు పండితుడు. అయినా రామదాసు ఏమీ మాట్లాడకుండా తల వంచుకొని వెళ్లిపోయేవాడు.

ఆరోజు ఉదయాన్నే పండితుడు సూర్యోదయానికి ముందే నదికి స్నానానికి వెళ్లాడు. నదిని సమీపించేసరికి, నదిలో స్నానంచేసి వస్తూ రామదాసు ఎదురయ్యాడు. అతన్ని చూడగానే పండితునికి గంగవెర్రులు ఎత్తింది.

"ఓరి దౌర్భాగ్యుడా! ప్రొద్దున్నే నీ దరిద్రపు ముఖం చూపించావా? పైగా – పవిత్రమైన నదిని ముట్టుకొని అపవిత్రం చేశావా?" అంటూ వళ్లు తెలియని కోపంతో రామదాసుపై పడి కసిదీరా కొట్టాడు. అయినా పాపం- సాధువులాంటి రామదాసు ఏమీ మాట్లాడలేదు. అన్నిటినీ మౌనంగా భరించి ఊరుకున్నాడు.



రామదాసుని బాగాకొట్టి, ఆ కోపంతో చిందులు తొక్కుతూ నదిలో స్నానం చేయడానికి దిగాడు పండితుడు. కోపంలో విసవిసా నడవడంతో అసలే పాకుడు పట్టివున్న మెట్టుమీద కాలు వేయగానే జర్రున జారి నదిలో పడిపోయాడు పండితుడు. ఆయనకి ఈతరాదు. వెంటనే ప్రవాహంలో కొట్టుకుపోసాగాడు. ఇంకేముంది! "రక్షించండీ...!" అంటూ అరవసాగాడు.

పండితుని కేకలు వినగానే రామదాసు పరిగెత్తుకుంటూ వచ్చి కేకలు వస్తున్నవైపు నీళ్లలో దూకాడు. కొట్టుకుపోతున్న పండితుడిని పట్టుకుని గట్టుకు చేర్చాడు.

తానెంత అపకారం చేసినా రామదాసు తన ప్రాణం రక్షించడంతో సిగ్గుతో, అవమానంతో తలదించుకుపోయింది పండితునికి. "రామదాసూ...విద్య మనిషికి సంస్కారం నేర్పాలి. నేను ఎంత చదువుకున్నా అహంభావమే కాని, సంస్కారం నాకు రాలేదు. నువ్వు ఏమీ చదవకపోయినా, ఎంతో సంస్కారం, మానవత ఉన్నవాడివి. నువ్వే నిజమైన పండితుడివి. నేను చదువుకున్న మూర్ఖుడిని. నిన్ను అంటరానివాడనటం పొరపాటు. నిజంగా నీలాంటి ఉత్తముని స్పర్శచే ఈ నది కూడా పవిత్రమైంది" అంటూ పశ్చాత్తాపపడసాగాడు. "బాబూ... మీరు పెద్దలు, అలా అనగూడదు" అన్నాడు రామదాసు వినయంగా.

ఆనాటినుంచి ఆ పండితుడు అందరు మానవుల్ని ప్రేమిస్తూ వారి సేవలో కాలం గడపసాగాడు.

★★★